# 42. తెగులు పట్టిన తెలుగు

"చేయెత్తి కొట్టరా తెలుగోడా!" అంటూ వాటేసుకున్నాడు అప్పారావు ప్లేన్ దిగీ దిగగానే.

"కొట్టను" అంటూ వాడి జేబులోని పార్కర్ పెన్ను నాణ్యం పరీక్షించటంలో మునిగిపోయేను.

"ఆ పెన్ను నీ కోసమే తెచ్చానులే! తర్వాత తీరిగ్గా శల్య పరీక్ష చేద్దువుగాని, ముందు నన్ను చూడు, నిన్ను చూడనీ! అన్నట్టు మన సుబ్రావ్, రామ్రావ్, గోవింద్రావ్, వెంకట్రావ్, చూబాయమ్మ, షుజాతారాణి అందరూ కులాషా! అందరూ ఈ అయిద్రాబాద్‌లోనే ఉన్నార్టగదా?" అన్నాడు అప్రావు.

వాడూ, నేనూ, వాళ్లూ అందరం ఆరో క్లాసులో దోస్తులం. అప్రావు మాత్రం ఏడో క్లాసు చదివేందుకు వాళ్ళ ఫాదర్తోపాటు ఆఫ్రికా వెళ్ళి అక్కడే సెటిలయిపోయేడు. అక్కడేదో గనిలో పని చేస్తున్నాడని విన్నాను.

మా చిన్నప్పుడు అప్రావ్ బామ్మగారు సాయంత్రం పూట మాకు కథలు చెపుతూ "మా అప్రావ్ బాబు ఆఫ్రి

కాలో ఏడో క్లాసు చదివేస్తున్నాడు. ఆఫ్రికా చాలా బాగుం టుందిట. మావాడి స్కూలు పద్దెనిమిది అంతస్తుల పెంకు టింట్లో ఉందట. మావాడి ఏడో క్లాసు ఏడో అంతస్తులో ఉందిట" అది చెప్పేది.

"అయితే, బామ్మగారూ, పద్దెనిమిదో అంతస్తులో ఎన్నో కాసు ఉంటుందండీ?'' అనడిగేనోసారి.

"ఓ బుల్లోడా! ఏడో అంతస్తులో ఏడో క్లాసుంటే, పద్దెనిమిదో అంతస్తులో పద్దెనిమిదో క్లాసుంటుంది. ఆ మాత్రం తెలీదురా! బోడి చదువులూ, మీరునూ. అయినా మన దేశంలో చదువులు ఇంతేలే. ఆఫ్రికా చాలా గొప్పదేశం సుమా! అక్కడ ఎక్కడ చూసినా బంగారమేనట. నువ్వు ఆఫ్రికా వెళ్లావనుకో నువ్వూ మా అప్పిగాడూ గోలీలాడు కునేందుకు గొయ్యి తవ్వితే అందులో బంగారం దొరికి తీరు తుంది" అనేవారు బామ్మగారు.

నిజమో, కాదోగానీ మా అప్రావ్ ఫాదర్ మాత్రం అక్కడో ఇల్లు కట్టుకుని సెటిలయిపోయాడు. అప్రావ్ క్రింద టేడాది ఇక్కడే మా అగ్రహారం పిల్లని పెళ్ళిచేసుకుని ప్లేనెక్కి ఆఫ్రికాకు మళ్ళీ వెళ్ళిపోయాడు.

మావాడు ఆఫ్రికా గనుల్లో ఏవో పరిశోధనలుచేసి "బంగారాన్ని బంగారంతోనే చేయవలెను. ఇత్తడితో చేయుట సాధ్యంగాదు" అని ఓ థీరీ రాసి డాక్టరేటు కొట్టేశాట్ట ఆ

సంగతి బి. బి. సి. వారు రేడియోలో ఘనంగా బ్రాడ్‌కాస్ట్ చేయగా విని మన ప్రపంచ తెలుగు సభల వాళ్ళు "చేయెత్తి జైకొట్టెదను తెలుగోడా! రా రమ్మ, చేసెదము నీకు సన్మానమ్ము" అని ఉత్తరం రాసి పిలిపించేరు మావాణ్ణి.

పోయేదేముంది! వాళ్ల ఖర్చుతో చుట్టపక్కాలందర్నీ చూసొద్దాం అనుకుని మావాడూ ప్లేనెక్కి హైదరాబాదులో దిగేడు.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ!" అని ఊరికే అనలేదురా పెద్దలు. స్వంత ఊరు వచ్చినట్లే ఉంది సుమా!" అంటూ పొంగిపోయేడు అప్రావు, ఏర్‌పోర్టు నుండి బయటకు రాగానే.

"సరేగానీ, హైదరాబాద్ ఏమిటీ? తెలుగు పేరులా లేదే!" అని సందేహం వెలిబుచ్చేడు.

"అబ్బె! అది తెలుగు పేరే! పూర్వం తెలుగుదేశాన్ని ఆ పేరుగల కోనసీమ బ్రాహ్మడొకడు పాలించేడులే!" అని దబాయించేను.

"ఓహో!"

ఇద్దరం టాక్సీకేసి నడిచేం.

"సైదాబాద్ కాలనీకి వస్తావుటయ్యా?" అనడిగేను డ్రైవర్ని.

"ఢేడ్ రూపాయ్యా ఎక్స్ట్రా సార్" అన్నాడు వాడు ఎక్కడక చస్తారా అన్నట్టు ధీమాగా.

"ఏమిటీ వీడు అంటున్నది ?" అని ఇంగ్లీషులో ప్రశ్నించేడు అప్రావు.

"మరేంలేదు. మన తెలుగు చాలా గొప్ప భాష ! ఏ సంకరాన్నయినా సహిస్తుంది. మనతెల్గూస్ శానా గొప్ప వాళ్ళు. వీళ్ళు తెల్గూ తప్ప అన్నీ చక్కగా మాట్లాడగలరు ! గర్వించరా ఆఫ్రికన్ తెలుగోడా!" అన్నాన్నేను, కాస్త దూరం పోయాక పెట్రోల్ బంకు దగ్గర ఆగింది టాక్సీ.

అప్రావు దూరాన కనబడుతున్న బోర్డు కేసి చూపించి బెదురుతూ అడిగేడు.

"వాట్ ఈజిట్ ?"

ఆ బోర్డు ఓ పెద్ద హోటలు వాళ్లది.

"మా హోటల్లో రుచికరమైన శాక కారము, మాంసహారములు లభించును" అని ఉందందులో.

"మాంసహారములు అంటే అదో స్పెషల్ లే. ఆఫ్రికాలో ఉంటున్న వాడివి. ఆ మాత్రం తెలీదురా" అన్నాను.

"సరే ! మన గోలీకాయల ఫ్రెండ్సునందర్నీ ఓసారి

చూడాలిగదా! ఎవరెవరు ఉన్నారీ అయిదురాబాధ్‌లో, ఎప్పుడు చూద్దాం?" అనడిగేడు అప్పారావు.

'సుబ్రావ్‌గాడు బజార్ ఘాట్‌లో ఉంటున్నాడు. వాడి ఆఫీస్ బషీర్‌బాగ్‌లో, రామ్రావ్ ఆఫీసు బర్కత్‌పురాలో. ఇల్లు మెహిదీపట్నంతో, గోవింద్రావ్ ఆఫీసు ఖైరతాబాదులో, ఇల్లు మలక్‌పేట్‌లో, చూబాయామ్మ ఇల్లు మసాబ్ టాంకులో. ఆవిడ మొగుడు పనిచేసేది హిమాయత్ నగర్‌లో. షుజాతారాణి ఆఫీను ఆబిడ్స్ రోడ్‌లోని చిరాగలీ లేన్‌లో ఉంది. ఇల్లేమో బీగంపేటలో" అంటూ అప్రావు కేసి చూసేను.

వాడు సీట్లో జారగిలబడి మూర్ఛపోయిన వాడిలా పడున్నాడు.

దార్లో ఓ హోటల్ దగ్గిర టాక్సీ ఆపించి చల్లని నీళ్ళు తెప్పించి వాడి మొహం కడిగాక కాస్త తేరుకున్నాడు.

"అయితే ఇంతకీ మనం ఉన్నది తెలుగుదేశపు రాజధానిలోనా? లేక పాకిస్తాన్‌లోనా?" అని బెదురుతూ, బెదురుతూ ప్రశ్నించేడు.

'భయపడకు! ఈ టాక్సీవాడు పాకిస్తాన్ ఏజంటు కాదులే. మన తెలుగు వాళ్ళ హృదయాలు ఆఫ్రికన్ సరస్సుల్లా సువిశాలం. ఉర్దూనీ, ఫారశీనికూడా మాతృభాష లాగే ప్రేమించగలరు" అని ఓదార్చేను.

ఆ తర్వాత అప్రావు హోటల్లోకి వెళ్ళి తెలుగు మహా సభల వాళ్ళకు ఫోన్ చేసేడు.

"అయ్యా నేను వచ్చేనూ!" అని చెప్పటంకోసం.

రింగ్ చేయగానే అవతల్నించి జవాబొచ్చింది.

"యస్! ది సీజ్ ది ఆఫీస్ ఆఫ్ వరల్డ్ తెల్గూ కాన్ఫరెన్సెస్, వాడ్డూయూ వాంట్?" అగి గద్దించిందో అధికార కంఠం.

అప్రావు మరోసారి మూర్ఛ పోబోయేడు. కానీ, ఓ సారి అనుభవం అయి ఉండటాన్నేమో, తట్టుకున్నాడు.

"అయ్యా! మైనేమిజ్ అప్రావ్! ఐ కేం ఫ్రం ది గ్రేట్ ఆఫ్రికా! మీరు సన్మానం చేస్తాం రమ్మన్నారని వచ్చాను. నాకు సన్మానం ఎప్పుడు? ఎక్కడ?' అని సవినయంగా అడిగేడు అప్రావు ఫోనులో.

అవతలి వాడు మరుక్షణం మర్యాదస్తుడయిపోయేడు. "వాట్! వాట్! ఆఫ్రికానుండే- అప్రావ్‌గారే! చాలా చాలా సంతోషం అప్రావ్‌గారూ! మీకు సన్మానం ఫతేమైదాన్‌లో జరుగును. వివరములకు మీరు మా ఆఫీసుకు దయచేయగలరు!' అని ఫోన్ పెట్టేశాడు

'ఆఫీస్ ఎక్కడ్రా?' అనడిగేడు అప్రావు నన్ను.

'అదా! సైఫాబాద్‌లో ఉంది'

'అదెక్కడ''

"లకిడికాపూల్ ప్రక్కన.'

"అదెక్కడ?"

"ఖైరతాబాద్‌ను ఆనుకొని.''

"అదెక్కడ?'.

"అమీర్‌పేట్ వెళ్ళే దారిలో."

"ఆపాపు!' అరిచేడు అప్రావు. టాక్సీవాడు బెదిరిపోయినట్టున్నాడు. టాక్సీ ఆపేసి గడ్డం నిమురుకుంటూ తలుపు తీసి 'చెడింది సాబ్!' అన్నాడు.

చేసేది లేక దిగి బస్‌స్టాప్ కేసి నడిచేం.

ఓ బస్ వచ్చింది. 'అదేంటి?' అనడిగేడు అప్రావు బస్సుమీది బోర్డు కేసి చూపుతూ. దానిమీద 'దిల్‌సుకునగర్" టు శకరశేట్" అని ఉంది.

"అది తెలుగులే. మనది అంతర్జాతీయ భాష. దిల్‌సుఖనగర్ నుండి శక్ర చేరియట్‌కు ఈ బస్సు పరుగెత్తును అని దానర్థం 'అన్నాను.

ఇంతలో మా కాలనీ బస్సు వచ్చింది. 'ఇదేంటి' అనడిగేడు అప్రావు మళ్ళీ బెదిరిపోతూనూ బస్సు బోర్డు కేసి చూపుతూ "యస్.బి యల్. యల్. సి. హెచ్. కాలనీ టు ఊమాన్స్ కాలేజ్" అని ఉందా బోర్డు మీద.

'అది తెలుగే. అధికార భాష అంటారు దాన్ని. హైదరాబాద్ లోకోస్ట్ హౌసింగ్ కాలనీ నుండి ఆడంగుల కళాశాలకు అని దానర్థం' అన్నాన్నేను. లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్లా ఫోజు పెట్టి.

అప్రాపు కూలబడ్డాడు. మళ్ళీ ఠకీమని లేచి 'అదేంటి?' అనడిగేడు ఓ చిన్న బోర్డుకేసి చూపుతూ. దానిపై 'మెడ మీద టైపు చేయబడును' అని ఉంది.

'అద్భుతం. మనవాళ్ళు చాలా చాలా క్రొత్త ప్రయోగాలు చేసి సాధించినట్లున్నారు. మెడమీద ఎలా టైపు చేస్తారబ్బా! పోయి చూసొద్దామా?" అనడిగేడు వాడు.

'కాదు! టైపు ఇన్స్టిట్యూట్ మేడమీద ఉంది. దాని అర్థం వేరులే.' అని ఆపేను.

ఇంతలో మా కాలనీ బస్ కదలబోతే వాణ్ణి అందులోకి తోసేసి నేనూ ఎక్కాను.

(జూన్ 1975)